# ఎక్కడినుంచి....ఇక్కడి దాకా!



## - స్వాతి శ్రీపాద

*(క్రిందటిసంచిక నుంచి తరువాయి)*

## 4

మనసు వేగాన్ని కాంతి సంవత్సరాల్లో కూడా కొలవలేమేమో ! ఇప్పుడిక్కడుంటుంది. మరుక్షణం మరెక్కడో! ఇంటికి వెళ్ళే అయిదు నిమిషాల్లోనే ఎక్కడెక్కడ విహరిస్తోంది? కాలేజీ నించి ఇంటికి వెళ్తూ ఎన్ని విషయాల్లోకి వెళ్ళిపోయింది మనసు?

ఇంతకీ ఇంటి విషయం కదూ ఆలోచిస్తున్నది?

ఊరి చివరున్న ఇంట్లో, లంకంత ఇంట్లో, ఒకప్పటి పౌల్ట్రీ ఫాం, ఓనర్ విదేశాలకు వెళ్తూ ఎవరూ - ఆక్రమించుకోకుండా చూస్తూండమని అప్పగించిన ఇల్లు...

పట్నం వచ్చిన కొత్తలో అయిదారేళ్ళపాటు ఉన్న ఇంటికి ఒక ఏడాదైనా సరిగా అద్దె ఇవ్వలేదనుకుంటా ... విషయం తెగేవరకూ వచ్చాక మరో చిన్న ఇంటికి మారటమూ గుర్తే. పెద్ద హాల్ లాంటి వంటగది చిన్న బెడ్ రూం .. దాని ముందు విశాలమైన నడవా ... నడవాలోనే మేమందరం పడుకునే వారం.

అప్పట్లోనే ఒకసారి ఎదో పనిమీద వెళ్ళి బస్ స్టాండ్‌లో పడిపోయారట నాన్న.. పెద్ద దెబ్బలేమీ తగలనేలేదు. భుజం కాస్త మోపు చెయ్యడం అదీ దాని బరువంతా పడటం వల్ల కావచ్చు. అక్కడో ఇక్కడో కాస్త గీరుకు పోవడం..

అంతే ... వంకన బయటకు వెళ్ళడమే మానుకున్నారు. పని లేదు సంపాదనలేదు .. అందిన కాడికి అప్పులు చేసి ఓ పూట తినీ ఓ పూట తినకా ...

అమ్మను చాలా సార్లే అడిగిన గుర్తు ఇల్లమ్మి తెచ్చిన డబ్బులు ఏంచేశారని...

చెప్తారా? పైసా వేసి పది లాగాలనుకునే దారిలో మొత్తం పోగొట్టుకునే ఉంటారు.

చివరకు ఐదారునెలల్లోగానే చిన్నఇంటికీ అద్దె ఎగగొట్టి పౌల్ట్రీ ఫాంకి మారడం జరిగింది. అది చాలా ఏళ్ళుగా వాడుకలో లేకపోవడం వల్ల కరెంట్ లేదు... కరెంట్ కనెక్షన్ ఉన్నా బహుశా బిల్ పే చెయ్యలేదులావుంది, కట్ చేసినట్టున్నారు. ఓ మూలన మంచినీటి కనెక్షన్, ఓ మూల బావి, మరోమూల టాయిలెట్స్ ...

ఒక పెద్ద రేకుల షెడ్ లాంటి హాల్ ... అందులోనే ఓ చివర్న సామానులు సర్దుకుని వంట ... మరో చివరకు రేకు తలుపు ...

గేట్ పక్కన ఒక గది .. అందులో పెద్ద జంపఖానాలు వాటినే పరుచుకుని మేమంతా అక్కడే పడుకోడం,... రెండు నులకమంచాలు ఓ నవారు మంచం షెడ్ లోనే వేసుకుని అక్కడే గదిలోనే పడుకునే వారు అమ్మానాన్నా.

మొదట్లోదొడ్లో  మొలిచిన తోటకూర గోంగూరలతో కాలక్షేపం ఆరంభించాక నెమ్మది నెమ్మదిగా నిలువెత్తు మొలిచిన గడ్డికోసి అమ్మేసి, పూజకు పూలమొక్కలు తెచ్చి నాటుకోడం,  కూరల పాదులు వేసుకోడం వసూలు చేసి బాంక్‌లో వెయ్యవలసిన అద్దె వాడుకోడంతో రోజులు ఓ మోస్తరుగా నడవడం ఆరంభమైంది.

కరెంట్ లేకపోవడం వల్ల కిరసనాయిలు దీపాలే గతయ్యాయి. ఇప్పటికీ అంతే చదువుకైనా, ఏపనికైనా కిరసనాయిలు దీపాలే గతి.

అలాంటి వాతావరణంలో పెరిగే నేను దురాశకు పోతున్నానా శ్రీరాం గురించి ఆశపడి అనిపించింది.

కాని మనసుకు వాస్తవాలు సాధ్యాసాధ్యాలు అవసరం లేదు. అందని కలలు కనటమే దానికి తెలుసు.

చాలా రోజులు కాలేజికి వచ్చేప్పుడూ పోయేప్పుడూ శ్రీరాం ఆలోచనలే వెన్నాడేవి.. ఏ పని చేస్తున్నా అతని వదనమే కళ్ళల్లో తారాడేది. అతనికి నా ఆలోచనల సంగతి తెలియబరచకపోతే ఎలా తెలుస్తుంది? అలాగని నా అంతట నేను ముందుకు వెళ్ళి అడిగితే...

ఎటూ తేల్చుకోలేక చివరకు నా కలలకు ఒక అక్షర రూపం ఇచ్చి కవితగా మలచి అతని అడ్రస్‌కు పోస్ట్ చేసాను. చేసే వరకూ ఆగలేకపోయాను. అందులో నా కాలేజీ అడ్రస్ రాయడం మర్చిపోలేదు--అతనికి తెలుసని తెలిసినా.

నిజంగా  కవిత నా హృదయంలోంచి పుట్టుకు వచ్చింది. చదివిన వారి గుండె  తడిమి తీరుతుంది.

*"యుగాలుగా, ఎన్నో జన్మలుగా వెతుకుతున్నాను*
*నానుండి దూరంగా వెళ్ళిపోయిన నీ చిరునామా కోసం*
*ఒక్క చిరునవ్వు , ఒక్క దరహాసం*
*గతించిపోయిన జీవితాల జ్ఞాపకాల నిక్షిప్తా లను తవ్వితీసి*
*సుషుప్తిలో తరాలతరబడి నిద్రాణమైఉన్న ఆశల్నుతట్టిలేపి*
*ఊహకందని ఉత్తేజాలను  గుండె గోడలమీద చిత్రించుకు*
*ప్రియా!*
*మీ చూపుల చిరుజల్లులో తడిసిముద్దయి*
*నన్ను నేను తనివితీరా అర్పించుకుందుకు*
*ఎదురు చూపులో ... మరెన్ని యుగాలైనా ఇలాగే "*

పోస్ట్  చేసిన క్షణం నుండి అతని ఆలోచనే. చదవగానే ... కాదు కాదు ముందు ఎదురు చూడని ఉత్తరం అందుకోగానే ఏమనుకుంటాడు? చదివాక ఏదో ఒక జవాబు ఇవ్వాలిగా?

వెంటనే ఇస్తాడా? ఆలోచిస్తాడా? ఏమో!

ఆలోచనల్లో ఒక వారం గడిచిపోయింది.జవాబు మాత్రం రాలేదు. ఓ పక్క రాదన్న అనుమానం పీడిస్తున్నా మరోపక్క .. ఏదో ఆశ..

మండే వెళ్తూనే కాలేజి మెయిల్ బాక్స్‌కి వెళ్ళి చూసుకున్నా ఉహూ... ఏం ఉత్తరం లేదు.

అన్యమనస్కంగానే క్లాస్‌లో కూర్చున్నా ఏం చెప్తున్నారో నెత్తికెక్కడం లేదు.

లంచ్ టైంలో తెచ్చుకున్న ఆవకాయ పెరుగన్నం సగం తిని మిగతాది పారేసి బయట మామిడి చెట్టుకింద కూచుని నా ఆలోచనల్లో నేనున్నాను.

ఎప్పుడు హేమ వచ్చిందో గమనించనే లేదు. హేమ చిన్నప్పటినుండీ తెలుసు. నేనూ తనూ ఒకే స్కూల్లో చదివి కాలేజికి వచ్చినా తనది ఆర్ట్స్ గ్రూప్ ..బిఏ.

" ఏం చేస్తున్నావు... గాల్లోకి ఆలోచనలు విసురుతున్నావా? " అంటూ వచ్చి పక్కన కూచుంది.

పనిగట్టుకు వచ్చి మాట్లాడించటంతోటే తెలుస్తోంది... ఏదో చెప్పాలని వచ్చిందని.

"చెప్పు హేమా ఏంటి సంగతులు ...?"

" ఏమున్నాయి, శ్రీరాం కి ఓ కవిత రాసి పంపావటాగా ...!?"

తెల్లబోవటం నావంతైంది.

"శ్రీ రాం నీకు తెలుసా...?"

" అవును ... అతని అక్కయ్య మా అక్కయ్య క్లాస్‌మేట్ అప్పుడప్పుడు అక్కతో పాటు మా ఇంటికి వచ్చేవాడు..."

పైన మరేమీ వినదలుచుకోలేదు... ఈ విషయం జవాబు నాకు చెప్పకుండా మరెవరో మూడో వ్యక్తికి చెప్పడం ... సిగ్గుతో మనసు కుంచించుకు పోయింది.

ఏం చెప్పివుంటాడో కూడా తెలుసుకోదలుచుకోలేదు. "అల్లాగా!?" అంటూ మాట తప్పించి వెయ్యడం తప్ప.

కాని అంతర్లీనంగా ఎంత నరకం అనుభవించి ఉంటానో భగవంతుడికే తెలియాలి..

ఎన్ని రోజులు ఎన్ని సంవత్సరాలు నరకం నన్ను కాస్త కాస్త చిత్రహింసకు గురిచేసిందో..

ఆ సంఘర్షణలో ఇటు చదువు గురించి కాని అటూ మిగతా విషయాలగురించికాని పెద్ద శ్రద్ధ చూపలేకపోడం నిజమే.

తిన్నది ఒంటపట్టేది కాదు, కంటినిండా నిద్ర వచ్చేది కాదు...

నాకు జీవితంలో ఇంతే రాసిఉందా...

నేను దురాశకు వెళ్ళానా?

నేను పుట్టి పెరిగిన వాతావరణానికి నేను బాధ్యురాలనా?

ఎందుకు నన్నతడు నిర్లక్ష్యం చేశాడు? వీటికి జవాబు దొరకదు. కాని మనసు స్థిమితపడదు. ఇది జన్మంతా వెన్నాడే ఓ జ్ఞాపకం.

అదృష్టవంతురాలినా ... కాదు కాదు కానే కాదు గొప్ప దురదృష్టవంతురాలిని .. అందుకే ఏ జన్మలోనో పొందలేని బంధం ఎదురైనా నాది కాలేకపోయింది.

ఒక రకమైన నిర్లిప్తత మనసు నావరించింది.

మంచి ఆస్తి పాస్తులు లేకపోయినా , సదుపాయాలు లేకపోయినా , సంరక్షణలేకపోయినా వెలితి పడలేదు. కాని... ఇప్పుడిక ఏం ఉంటే ఎంత? ఏం లేకపోతే ఎంత...

చాచి పెట్టి చరిచినట్టూ మాటి మాటికీ మనసు గాయాన్ని కాకి పుండులా రేపే జ్ఞాపకం నేనొక ఓటమినని జీవితమంతా గుర్తు చేస్తూనే వుంది...

అందుకే మరిక ఎప్పుడూ ఏమీ ఆశపడ కూడదన్న ఓ నిర్లిప్తత...

చెక్కిళ్ళమీద జారిన కన్నీళ్ళు చల్లగా తగిలి ఈ లోకానికి వచ్చాను... నిన్నా ఈ రోజా ఇది జరిగి దాదాపు నలభై సంవత్సరాలు..! ఇన్నేళ్ళుగా ఒక్కసారీ అతని గురించి కనీసం విననుకూడా వినలేదు. చూడలేదు..

అయినా ఇప్పటికీ తలుచుకున్నప్పుడల్లా మళ్ళీ ఇప్పుడే ఈ ఓటమిని ఎదురుకుంటూన్నట్టూ ...

కళ్ళు తుడుచుకుంటూ ఎవరికైనా చెప్తే "పిచ్చిమొహం అంటారేమో...!?"

అప్రయత్నంగానే నవ్వుకున్నాను.

క్షణం కన్నీళ్ళు అంతలోనే నవ్వు... ఇదే నా జీవన సరళి.

*******

జీవితాన్ని మలుపుతిప్పిన మరో సంఘటన వద్దన్నా మాటిమాటికీ గుర్తొస్తూనే వుంటుంది.

పెద్దక్క పెళ్ళి. అది గత్యంతరం లేని పరిస్థితుల్లో కుదిరిన పెళ్ళి.

చాలా రోజులపాటూ జబ్బు పేరిట ఇంట్లో ఉండిపోయి తిని పడుకుని కాలక్షేపం చేసే తండ్రికి ఎదుగుతున్న కూతుళ్ళు ఎదమీద కుంపట్లని అనిపించకపోవడం అదృష్టమా దురదృష్టమా ...!?

ఏమో ! అయితే ఇల్లు మాత్రం ఒక నరక కూపంగా తయారయింది.

ఇంటి పనులకు రోజూ గొడవలే. అత్తాకోడళ్ళ మధ్య గొడవలు వినటం, చదవటం జరిగి ఉండవచ్చు కాని తల్లీ కూతుళ్ళమధ్య...

ప్రత్యక్షంగా చూసాక నమ్మకుండా ఎలా వుండను?

పెద్దక్కకూ అమ్మకూ రోజూ హోరా హోరీ గొడవలే... వీధి వాకిలి చిమ్మి ముగ్గు వెయ్యడం నుండి మొదలు అరుచుకోడాలు తిట్లు... చివరకు నాన్న కల్పించుకుని "నోరు ముయ్యండి వెధవల్లాలా ... వెధవగోల వెధవగోలాని..నే చచ్చే దాకా ఇల్లాగే కొట్టుకు చావండి.."

అనే వరకూ హోరుగాలే.

చీటికీ మాటికీ గొడవకు కారణం ... అటు చదువు లేక ఇటు వ్యాపకం లేక ఇంటి పనిచేస్తూ ఎన్ని రోజులని అక్క అలా ఇంట్లో పడుండాలి.

పెళ్ళి మాటే ఎత్తరు... అక్క కొడుకొకడు ఉద్యోగంలో ఉన్నాడంటే అమ్మ పోరు పెట్టగా పెట్టగా కదిపి చూశారు... తమ్ముడి సంగతి తెలుసేమో ఆవిడముందుగానే తన కోరికలన్నీ బయటపెట్టింది.

" స్వంత అక్కై వుండీ కట్నం పది వేలు అడుగుతుందా? అసలు కట్నమిచ్చే వాడికిచ్చి పెళ్ళే చెయ్యను " అనేశాడు.

ఆడపిల్ల తండ్రినని ఆయనకు గుర్తులేదు.

రెండో అక్క అంతో ఇంతో చదువుకునేది. పెద్దక్క మరి చదవననేసింది.

ఆ తరువాత ఏ పెళ్ళి సంబంధమూ చూసిన గుర్తే లేదు.

పాతికేళ్ళు దాటిపోయిన కూతురికి పెళ్ళి చెయ్యమని ఆయనకు చెప్పే ధైర్యం ఎవరికీ లేదు.

రెండో అక్క చేరిన చిన్న ఉద్యోగం మూలంగా రోజంతా బయటే గడపడం వల్ల పెద్ద గొడవలుండేవి కాదు. అయినా అమ్మ కూడా నాలుగు రాళ్ళు సంపాదిస్తోందని దాన్ని ప్రత్యేకంగానే చూసేది. నాలుగు రాళ్ళ వల్లే కుటుంబం గడుస్తోంది. అమ్మ నలుగురికీ అంతో ఇంతో సాయపడటం అప్పుడో ఇప్పుడో అప్పు పుట్టడం పెద్ద ఇబ్బందయ్యేది కాదు.

బంధువులందరికీ దూరంగా ఇంత దుర్భరమైన జీవితాలు గడిపేటప్పుడు ఏ ఒక్కళ్ళూ చివరకు ఓ మోస్తరుగా జీవనాలు సాగిస్తున్న అమ్మ అక్కచెల్లెళ్ళుకూడా సాయం చేసేందుకు ముందుకు రాకపోడం ఆశ్చర్యం.

ఒకసారి నాన్న ఎక్కడికో వెళ్ళారు. రాత్రి ఎనిమిది గంటల సమయం.

ఎందుకు గొడవమొదలైందో కాని పెద్దక్కకూ అమ్మకూ మాటల యుద్ధం పెరిగి పెరిగి చివరకు అమ్మ ఓ గదిలోకి వెళ్ళి " నే ఉరి పెట్టుకు చస్తా మీరు హాయిగా వుండండి " అంటూ ధడేల్న తలుపు వేసుకోడం పిల్లలమంతా

"అమ్మా వద్దే అమ్మా వద్దే"అంటూ గది ముందు చేరి తలుపు కొట్టడం... నాకింకా గుర్తుంది రెండో అక్క గజగజ ఒణికి పోతూ ఏడవటం. కాస్సేపు మేమందరం అలా ఏడ్చాక అమ్మ తలుపు తీసుకుని బయటకు వచ్చింది ఏడుస్తూ.

చివరకు ఈ గొడవలకు విసిగిపోయారేమో ఇంటికి వచ్చిన ప్రతివాడినీ మా పెద్దమ్మాయిని పెళ్ళి చేసుకుంటావా అని అడగటమే...

ఇప్పుడనిపిస్తుంది... పదహారేళ్ళ వయసు వచ్చినప్పటినుండీ ఇంట్లో చాకిరీ చేస్తూ అదుపాజ్ఞలలో వుండీ పెట్టినది తిని ఇచ్చినది కట్టుకుని పడివుండమంటే ఏ ఆడపిల్లయినా గదిలో పెట్టి బంధించిన పిల్లి పులిగా మారినట్టుగా క్రూరంగా మారిపోయుందేమోనని..

ఒకసారి కాబోలు ఎవరో మహారాష్ట్రావైపు వాళ్ళు అక్కను చూసి పెళ్ళికి ఒప్పుకున్నారు. ఏమాటకామాటే చెప్పుకోవాలి అక్క గులాబీ రంగు కలిసిన తెలుపుతో బారెడు జడతో అందంగానే ఉంటుంది.

కాని వాళ్ళది ఒకే ఒక్క కండిషన్ .. ఒక్కడే కొడుకు కనక పెళ్ళి వాళ్ళ ఊళ్ళో వాళ్ళింటి ముందు జరగాలి. అంతకు మించి వాళ్ళు కోరినదేమీ లేదు.

కాని దాన్నే నాన్న అంగీకరించలేదు.

"అలా వీల్లేదు , నా కూతురి పెళ్ళి తిరుపతిలో చేస్తానని మొక్కుకున్నాను. అక్కడే చేసితీరాలి" దాంతో సంబంధం వీగిపోయింది.

ఆ తరువాత ఏ పెళ్ళి కొడుకూ చూపుల వరకూ వచ్చిందే లేదు. పెద్ద వాళ్ళు పట్టించుకున్నదీ లేదు.

తల్చుకుంటే ఆశ్చర్యంగా వుంటుంది. ఎంత గర్భ దరిద్రుడైనా తండ్రి అనే వాడు తన పిల్లల భవిష్యత్తుగురించి ఇసుమంతైనా ఆలోచిస్తాడు , మరి నాన్న అంత పట్టనట్టుండటం మా ఖర్మా? ఈ ఆగర్భ దారిద్ర్యపు స్థితిలోనూ పిల్లలు భగవంతుడిచ్చే వరాలు అనుకుంటూ వారిని కంటూ పోయే అమ్మకు కాస్త కుటుంబాన్ని పగ్గాలు పట్టుకు అదుపులో పెట్టుకుందామని తెలియదా?

అప్పుడప్పుడే నా చదువు పూర్తయి దొరికిన పార్ట్ టైం ఉద్యోగాలు ప్రయత్నిస్తున్నాను..

తెలిసిన బంధువులకు చెప్పాము -నేను రెండో అక్క పెద్దక్క గురించి ఏవైనా సంబంధాలు చూడమని..

అప్పుడే వచ్చిందా సంబంధం.. వరుడు ప్రభుత్వ పాఠశాలలో టీచర్. అదే పెద్ద వరమనుకున్నాము. అక్క ఏదో రకంగా తనైంట్లో తను ఉంటే చాలనుకున్నాము.

పెళ్ళి చూపుల్లో అతన్ని చూశాక నోట మాటా రాలేదు. నల్లటి గుండ్రాయిలా అక్కముందు కాకి ముక్కు లాగేఉన్నాడు.

అయినా అందచందాల గురించి ఆలోచించే అవకాశం మాకు లేదు. ఒప్పుకున్న వాళ్ళ కిచ్చి చేస్తే అదే మహ ఎక్కువ. వాళ్ళు పెద్దగా కోరిందేం లేదు. వెయ్యిన్నూట పదహార్లు పెళ్ళి చెయ్యడం.

అరగంటలో నచ్చిందంటూ పిల్లకు ఓ ఉంగరం ఓ చీర పెట్టి వెళ్ళారు. పెళ్ళి నెలరోజుల్లో ఉందని ఖరారు చేసుకుని.

పెళ్ళి కుదిరిందని సంతోషించామే కాని మమ్ములను కూడా వంచించే వారుంటారని మేం అనుకోలేదు.

పెళ్ళి నెలరోజుల్లో ఉంది.. కావలసిన సరంజామా సమకూర్చుకోవాలి... కాని నిమ్మకు నీరెత్తినట్టుగా ఒక్కరోజూ ఆవిషయం చర్చించలేదు నాన్న.

ఓ పదిరోజులయ్యాక కాబోలు ఎక్కడో పనుంది నాలుగు రోజుల్లో వస్తానని వెళ్ళాడు. కాబోసనుకున్నాం.

కాని మరో పది రోజులైనా ఉత్తరం పత్రం లేదు, ఆయన అజా పజా లేదు..

ఓ పక్క పెళ్ళి దగ్గరకు వస్తోంది.

రెండో అక్క ఎక్కడో బట్టల కొట్టులో నెలవారీ కట్టేలా ఒప్పందం చేసుకుని బట్టలు తెచ్చింది. అందులో తనకోసం ఓ రెండు చాలా మంచి చీరలు తెచ్చుకోడం అది వేరే విషయం.

బియ్యం లాంటివి పప్పులూ ఉప్పులూ కూడా అప్పులు తేవడం అయ్యింది. ఇహ కావలసింది మంగళసూత్రం , పిల్లాడికి ఉంగరం చుట్టూ మధుపర్కా లలాంటివి --వాటికెలాగూ తాతయ్య డబ్బు పంపుతాడు.. పెళ్ళికి ఎవరైనా రావడమో వస్తూ తేవడమో ముందుగా మనియార్డర్ చెయ్యడమో జరుగుతుంది. ఇహ చూసుకోవలసినది వెయ్యిన్నూట పదహార్లు.

అందులో వెయ్యిరూపాయలు నా జీతం ఎలాగూ పెళ్ళికి వారం ముందు రానే వస్తుంది.

అందుకే మరీ భీరువులమై పోలేదు. పెళ్ళి ఆగదనే ధైర్యం ఏమూలో వుంది. ఈ సారి పెళ్ళి ఆగిపోతే ఇహ మళ్ళీ అవడం జరగని పని.

రెండు రోజుల్లోకి పెళ్ళి వచ్చినా నాన్న రాలేదు, ఉత్తరం మరేదో కబురూ ఏవీ లేవు... " ఆయనకలా చెప్పాపెట్టకుండా నెలలు నెలలు వెళ్ళడం అలవాటే...వచ్చినా రాకున్నా పెళ్ళి ఆగేదే లేదు.. ఏ గుళ్ళోనో జరిపించేస్తాము.. ఏ అమ్మనో బతిమాలితే కాళ్ళు కడక్కపోదు" అమ్మ నిర్ణయానికి రావడం ఆశ్చర్యమే.

అయితే తెల్లవారి రాత్రి పెళ్ళనగా దిగాడాయన. ఎక్కడికి వెళ్ళారని గాని ఎందుకు రాలేదని గాని అడిగేదెవరు.. ఆయన వెనకాలే తాతయ్యా వచ్చాడు.

ఉన్నంతలో ఇంట్లోనే పందిరి వేసి పక్కింటి నించి కరెంట్ వైర్ లాక్కుని, ఇరుగు పొరుగుల సాయంతో పెళ్ళిపనులు - ఆరంభమైనాయి.

బాగా దగ్గర వాళ్ళు తప్ప పెద్దగా ఎవరినీ పిలవలేదు. ఇంటి పేరు గల ఆఫీసర్ గారొకరు పరిచయం , అన్నయ్యగారనే వాళ్ళం , ఆయన వచ్చాడు. పనులతో క్షణం తీసిక లేకుండా తిరుగుతూనే ఉన్నాము.

ఉన్నట్టుండి అన్నయ్య గారు " ఓ సారిలా రామ్మా " అని పిలవడంతో పెద్దపనేమిటో అనుకుని వెళ్ళాను

నూటపదహారు రూపాయలు నా చేతిలో ఉంచినప్పుడు ఆయన పెళ్ళికి సాయంగా ఇస్తున్నాడేమో అనుకున్నాను.

" వాళ్ళకు ఇవ్వాల్సిన డబ్బు నూట పదహార్లు తక్కువ పడిందట ససేమిరా అనికూచున్నారు... ఇదిగో తలా ఓ పదిరూపాయలూ పోగేశాను.."

నా కాళ్ళకింద నేల కుంగి లోపలకు వెళ్ళిపోతే బాగుండుననిపించింది.

******

(కొనసాగింపు వచ్చేనెల)

Post your comments